# బిచ్చుకత్తె

మండు వేసవి. మిట్ట మధ్యాహ్నం లోకాలను కాల్చేంత వేడిగాలి. నాలుకలు ఎండిపోతున్నాయి. ఒళ్ళు మండిపోతోంది. తల మాడిపోతుంది. ఇళ్ళలో ఉండలేక జనం అల్లాడి పోతున్నారు. రోడ్లమీద నడవలేని వారు చెట్ల నీడలు చూసుకొని పరుగులెత్తు తున్నారు.

ఆ సమయంలో ఒక బిచ్చగత్తె రోడ్లమ్మట బయలు దేరింది. చింపిరి జుట్టు, చిరిగి మాసిన బట్టలు. లోతుకు పోయిన కళ్ళు. చిక్కి శల్యమైన ఒళ్ళు. అరిగి తెగిన పాత చెప్పులు. అడుగు తీసి అడుగు వెయ్యడానికి ఓపికలేక ఆయాస పడుతోంది. అయినా నెమ్మదిగా శరీరాన్ని కదల్చుకుంటూ ముందుకు పోతోంది. ఓ ఇంటిముందు ఆగినట్టుగాని బిచ్చ మడిగినట్టుగాని లేదు. ప్రతి ఇంటిని చూస్తోంది. నిట్టూర్పు విడుస్తూ ముందుకు పోతోంది.

ఎత్తైన ఒక మేడ సమీపించగానే ఆగిపోయింది. ఆమె శరీరంలో సన్నని వణుకు చెప్పలేని భయం. కలవరపాటు, ఆమెను చూసిన వాళ్ళు ఇట్టే పసిగడుతున్నారు.

మెల్లిగా గేటులోనుంచి తొంగి చూసింది. వీధి తలుపులు మూసి ఉన్నాయి, చెప్పలేని నిరుత్సాహం ఆమెను చుట్టివేసింది. అయినా అలాగే నిలబడింది.

ఇంతలో తలుపు తీసుకొని ఆరేళ్ళ పాప మెరుపులా వచ్చి వీధి అరుగు మీద నిలబడింది. శవంలా కనబడుతున్న బిచ్చకత్తెను చూడగానె కెవ్వుమంది. పాపను చూసిన బిచ్చకత్తె మనస్సు ఆనందంతో తేలిపోతోంది. మరుక్షణం దుఃఖం లుంగలు చుట్టి మనస్సును నలిపి వేస్తోంది. గొంతుక వూడిపోయింది.

పాపా......!! అన్న మాటలు పైకి రాక నాలుక తడుపుకుంటోంది. వాలిపోతున్న శరీరం అలాగె నిలబెట్టుకుంటూ చూస్తోంది. ఇంకా మనస్సులో ఏదో చిన్న అనుమానం.

దానికి సమాధానం అన్నట్టుగా అరువదియైదు సం॥ వృద్ధురాలు. "ఏం జరిగిందమ్మా" అంటూ పరుగున బయటకు వచ్చింది. అనుమానం తీరిపోయింది ఆ బిచ్చగత్తెకు. ఆ ముసలమ్మను వాటేసుకున్న ఆ పిల్ల వెక్కి వెక్కి ఏడుస్తూ వీధి గేటు కేసి చూపించింది.

అటు చూసిన ఆవిడ కంఠం ఖంగున మోగింది.

—ఓ అమ్మీ! నీకు బుద్ధిలేదు. దెయ్యంలా గుమ్మానికెదురుగా నిలబడ్డావు. పిల్ల ఎలా దడుసుకుని ఏడుస్తోందో చూశావా!! ఇంకా అలా నుంచున్నావేం! కదలక!

అవన్నీ వినిపించుకునే స్థితిలో లేదు ఆమె. అడుగు ముందుకు వేసె శక్తికాని మనస్సుకాని ఆమెకు లేవు. ఆరేళ్ల వెనక్కు పరుగెట్టింది ఆమె మనసు.

అందాల రాధకు ఇరవై సంవత్సరాలకే వివాహమైంది. కోటి కోరికలతో అత్తవారింట్లో అడుగు పెట్టింది. భర్తకి

చక్కని ఉద్యోగం. రాధ అంటే అంతులేని ప్రేమ. అత్తగారికి చెప్పలేని అభిమానం. మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగి పోతోంది సంసారం. రాధ అంత అదృష్టవంతురాలు లేదన్నారు అంతా. రాధకూడా అలాగె మురిసిపోతోంది.

ఒక సంవత్సరం స్వర్గంలో ఉన్నట్లుగానే భావించింది రాధ. ఆమె ప్రేమ ఫలించినట్లుగా నెల తప్పింది రాధకు. భర్త, అత్త మురిసిపోయారు.

మూడు నెలలు వచ్చేటప్పటికి వేవిళ్ళు ఎక్కువయ్యాయి ఒక్కటే వాంతులు. మనిషి ఇట్టే నీరసపడింది. మునుపటిలా ఇంట్లో పని చెయ్యలేక పోతోంది. నిద్ర పోవాలన్న ధ్యాస తప్ప మరొకటి లేదు ఆమె మనసులో. క్రమంగా అత్తగారి సాధింపు ప్రారంభమైంది.

"రోగిష్టి పిల్లమ్మా ! తెలీక చేసుకున్నామమ్మా"

"ఓ అచ్చటా ముచ్చటా !"

"ఓ అత్తా మామా"

"దిక్కులేని సంబంధం" అంటూ కపపడ్డవారికి పిలిచి చెప్పడం ప్రారంభించింది ఆవిడ. ఆవిడ ధోరణికి మరింతా బెంగ పెట్టుకునేది రాధ.

నెలతప్పిన ఏ ఆడదానికైన వేవిళ్ళు, నీరసం సహజం. తోటిస్త్రీగా ఆదరించడంపోయి కఠిన శిలలా మారిపోయింది ఆవిడ.

ఆదరించే దిక్కులేదు రాధకు. పలకరించే దిక్కులేదు రాధకు. ఆమెకు తల్లితండ్రులు అన్నదమ్ములు లేరని తెలిసే అత్తగారు చేసుకుంది.

"ఇప్పుడు అచ్చట్లు ముచ్చట్లు ఎవరు తీరుస్తారు? నా ఆస్తి మీరే అనుభవిస్తున్నారుగా" అని అత్తగార్ని అడగాలని ఎన్నో సార్లు అనుకుంది. కాని ఆమెనోరు తెరిచి అడగలేకపోయింది.

భర్త ఆదరిస్తాడని ఎదురుచూసింది. కాని తల్లిని చూసిన తనయుడుకూడా మరింత కఠినంగా మారిపోయాడు. పలకరిస్తేనే దోషంలా కసురుకోడం ప్రారంభించాడు. పలకరిస్తే విసుక్కోడం మొదలుపెట్టాడు.

రాధ ఏమీ చెయ్యలేకపోయింది. ఏమైన అంటే నోరెట్టు కుని అరుస్తారని భయపడింది. పైగా తన మాటలకే విలువ లేనప్పుడు ఎందుకు మాట్లాడాలని ఊరుకుంది,

రోజులు అలా నడుస్తుండగానే పండంటి పాప పుట్టింది రాధకు. సుజాత అని పేరు పెట్టుకుంది. చంటిపిల్లను చూసిన రాధ మనస్సులో కోటిరాగాలు మ్రోగాయి. ఆ పిల్లతోటిదే లోక మనుకుంది.

తల్లీ కొడుకు కోడలిని ఆదరించలేకపోయినా పుట్టిన పిల్లను అపురూపంగా చూసుకుంటున్నారు.

భార్యాభర్తలమధ్య రానురాను అగాధం ఏర్పడుతోంది. కాంపులకని బయలుదేరి వెడుతున్న భర్త పదేసి రోజులవరకు ఇంటికి రావడంలేదు. రాధలో ఏదో చెప్పలేని దిగులు ప్రారంభ మైంది. చంటిపిల్లను చూసుకుని మర్చిపోదామన్న మనస్సులో భర్త ఆదరణకోసం ఆర్రులు చాస్తోంది. మనస్సు విప్పి చెప్పు కోడానికి ఈ విశాల ప్రపంచంలో మనిషే కనబడలేదు రాధకు. పైగా అత్తగారి ఎత్తిపొడుపు మాటలతో హృదయం గాయమవు

తోంది. ఆ గాయం మానడానికి ఆదరణ అనే మందే దొరకలేదు ఆ కోడలికి. ఒకరోజు కాంపునుంచి తిరిగివచ్చిన భర్తతో "ఏమండీ! మీరలా వెళ్ళిపోతే నాకు తోచడంలేదండీ" అంది మెల్లగా.

"చంటిపిల్ల సుజాత ఉంది పైగా పెద్దావిడ మా అమ్మ ఉంది. ఇంకా తోచకపోవడం ఏమీటి"?

"అ వికాదండీ" అంటూ ఏదో అనబోయింది. అతను లేచి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

మరోసారి అతని దగ్గరగా వెళ్ళింది.

"మీరలా అన్నేసి రోజులు కాంపులకి వెళ్ళిపోతుంటే నాకు రాత్రిళ్ళు భయమేస్తోందండీ. నేనూ వస్తాను మీతో" ధైర్యంచేసి రెండుమాటలు చెప్పి గట్టిగా ఊపిరి తీసుకుంది.

"అక్కడకెళ్ళి షికార్లు చేస్తా నను కున్నావా? ఆడంగి కబుర్లు చెబుతూ కూర్చోడానికి నాకు టైంలేదు" అన్నాడు కంఠం హెచ్చించి విసుగ్గా.

రాధకు ఆపుకోలేని దుఃఖం వచ్చింది.

చంటిపిల్లని పక్కలో వేసుకుని పడుకుంటే ఇంకా భార్యకు భర్త ఎందుకు? భార్యతో సరదాగా మాట్లాడితే ఆడంగి కబుర్లు అన్నమాట అనుకుని బాధపడింది. భర్త అలా మారిపోవడానికి తగిన కారణం ఊహించలేకపోయింది.

యినా అతను పురుషుడు. ఎక్కడికి వెళ్ళినా ఏంచేసినా తప్పులేదు. అడిగేవారు లేరు. అయినా మగవారికి లక్షాతొంభై పనులు అంటుంది లోకం. స్త్రీకి చదువు ఉండాలి. అందం

ఉండాలి. సంపాదన ఉండాలి, వినయం ఉండాలి. విధేయత ఉండాలి. పైగా ఏమన్నా నోరు మెదపకూడదు. అన్నిటికంటె ముఖ్యమైంది భర్తకు ఆమె యవ్వనం కావాలి. ఆమె మనస్సు మాత్రం అక్కరలేదు.

అందరూ స్త్రీ స్వేచ్ఛను గురించి మాట్లాడేవారే? కాని ఆమె మనస్సులోని బాధను ఎవ్వరూ పట్టించుకోలేక పోయారు. ఆమె మనస్సు భర్త ఆదరణకోసం ఎదురుచూసింది. ఆమె శరీరం భర్త పొత్తుకోసం తహతహలాడింది. కాని ఈలోకంలో ఆమెను అర్థం చేసుకునేదెవరు? ఆమె సమస్యను పరిష్కరించేదెవరు? పేదవాని కోపం పెదవుచేటు అన్నట్టుగా అమాయకురాలైన ఆడదాని కోరిక అడవుల కాచిన వెన్నెలయింది? భర్త తిరిగి కాంపుకి వెళ్ళి పోయాడు.

ఆయింట్లో మేడమీద అద్దెకుంటున్నాడు రాజా అనే అబ్బాయి. అతనితో మాట్లాడి ఎరగదు రాధ. అసలు అతనికి ఎదురుపడదు రాధ.

ఆరోజు అతను మేడమెట్లు ఎక్కుతూండే హాల్లో కూర్చుని ఉంది రాధ. అతనిచేతిలో ఏవో నవల్సుచూసింది. అడుగుదామని కూర్చున్నచోటునుంచి లేచింది. కాని మొహమాటంతో అడగలేక పోయింది.

రాధనుచూసిన అతనే "నవల్సు బాగున్నాయి చదువు తారా?" అడిగాడు చనువుగా.

"అవునండి ఏంతోచడంలేదు" అంది తలొంచుకుని.

"అంత మొహమాటపడితే ఎలాగండీ. అడిగితేకాని అమ్మ ఐనా పెట్టదు. ఈ రాజా ఎంత చెప్పండి? ఇవిగో తీసుకోండి" అంటూ రాధ చేతికి నవల్సు అందించి వెళ్ళిపోయాడు.

తిరిగి సోఫాలో కూర్చున్న రాధ ఒక నవలతీసి పేజీలు తిరగేస్తోంది.

గుడ్లు మిటకరించి చూస్తున్న అత్తగారిని గమనించలేదు. ఆ ఇంటికోడలు అలా మగవారితో మాట్లాడటం ఆమెకుఏమాత్రం నచ్చలేదు.

"ఏమోనమ్మా! మాకాలంలో ఇలాంటివి తెలీవమ్మా ! మొగుడు ఊళ్ళో లేనప్పుడు అలా పరాయి మగాళ్ళతో మాట్లాడటం నేనెక్కడా చూడలేదమ్మా!" అంటూ దీర్ఘాలు తీసింది. తననే అంటున్నదని ఇట్టే అర్థం చేసుకుంది రాధ.

"మాట్లాడ్డానికేముంది అత్తయ్యా ! ఏదో నాకంటె చిన్న పిల్లాడు. నాకు ఏం తోచడంలేదు. ఆ పుస్తకాలు కొనాలంటే బోలెడు ఖరీదు. అందుకని తీసుకున్నాను.

కుర్రాడేమిటే అతను. పెళ్ళయితే ఈపాటికి ఇద్దర పిల్లల తండ్రి అయ్యేవాడు. అయినా అబ్బాయి చూస్తే బాగుండదు. కావలసివస్తే నేనడిగి పుచ్చుకుంటాను. తెలిసిందా!" ఆజ్ఞాపించి నట్లే చెప్పింది.

భర్తకు ఏం చెప్పి పెడుతుందనే భయపడి "అలాగె అత్తయ్యా" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మరునాడు రాజా "ఏమండీ! రాధగారు ఇవిగో కొత్త పుస్తకాలు. మాఆఫీసునుంచి పట్టుకొచ్చాను. మీరు చదువుతానంటే

రోజూ తెస్తాను" అంటూ ఆ పుస్తకాలు అక్కడ పెట్టి వెళ్ళి పోయాడు.

ఆరోజు అత్తగారు మళ్ళా గొడవచేసింది. భర్తతో చెబు తానని బెదిరించింది కూడా. నాలుగురోజులు రాజాను తప్పించుకు తిరిగింది రాధ.

ఒకరోజు సోఫాలో పిల్లకు చొక్కా తొడుగుతూ కూర్చున్న రాధనుచూసి "హల్లో రాధగారు ఎక్కడా కనబడటంలేదు? ఒంట్లో బాగుండకనా లేక ఈ రాజాతో మాట్లాడటం ఇష్టం లేకనా" అన్నాడు నవ్వుతూ.

అతని తీయని పలకరింపుకు కరిగిపోయింది రాధ. అతని ఆప్యాయత మండే వేసవిలో ఐస్‌వాటర్ దొరికినట్లనిపించింది. కాని అత్తచూస్తే అల్లరిచేస్తుంది.

'నాకు కనబడకండి వెళ్ళిపొండి' అని అనలేక లోపలికెళ్ళి పోవడానికి లేచింది.

అది గ్రహించిన అతను ఆమె ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంటూ వాడిపోయిన ఆమె ముఖం చూశాడు. కొంతవరకు ఆమె బాధలు అతనికి తెలుసు. ఆమెను ఊరడించాలని ఉంది. కాని ఏంగొడవ జరుగుతుందోనని అతనికీ భయమే. అయినా ఆమెను ఒక్కసారి నవ్వించాలని అతనిఆశ. అంతకంటె తానేమి సహాయపడలేడు.

"మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయండి" అన్నాడు నవ్వుతూ.

"అబ్బే అదేంలేదండీ" గలగలా నవ్వుతూనె లోపలికి అడుగువేసింది రాధ.

"వస్తానండీ" అంటూ అతనూ పైకి వెళ్ళిపోయాడు.

హృదయం తేలికైంది రాధకు. అతను అలా పక్కన కూర్చుని మాట్లాడుతుంటె తనకు అన్నగారు ఉంటె ఇలాగె ఉండే వాడేమొ అనుకుంది. ఇంకా సేపు కూర్చుంటే బాగుండుననుకుంది. ఆసమయంలో అసలు అత్తగారె గుర్తుకురాలేదు.

'తనకు స్నేహితులు కావాలి. ఆత్మీయులు కావాలి. లేక పోతే బ్రతకలేను' అనుకుంది మనస్సులో.

ఆమె నవ్వుచూసిన అత్తగారికి వంటిమీద తేళ్ళు జెర్రెలు పాకినట్లయింది.

"వాడు రానీవే! నీ కులుకులేమిటో చూస్తా! ఛీ! ఛీ! ఆ వెకవెకలేమిటో? ఆ పకపకలేమిటో? ఎక్కడా సంసారి లక్షణాలు లేవు?" అలా సణుగుతోనే ఉంది.

అప్పటికి రాధ మామూలు స్థితికి వచ్చింది. సమాధానం చెప్పని రాధను చూసి మరింత రెచ్చిపోయింది ఆవిడ.

ఏమి అనలేని రాధ ఏడుస్తూ గదిలోకి వెళ్ళి మంచం మీద వాలిపోయింది. దుఃఖం కట్టలు తెంచుకు వచ్చింది.

చంటిపిల్ల నాయనమ్మ అరుపులకు, తల్లి ఏడుపుకు భయ పడి తానుకూడా ఏడవడం మొదలు పెట్టింది.

పిల్ల ఏడుపు విన్న రాధ లేచిరాలేదు.

అత్తగారే వచ్చి మనవరాల్ని ఓదార్చింది. ఖజాన వేసుకుని మరోసారి రాధను తిట్టింది. తర్వాత వంటింట్లో కొంగు పరుచుకుని పడుకొంది.

ఆ రోజు చంటిపిల్లను రాధ దగ్గరకు రానియ్యలేదు ఆవిడ. కోడలు ముట్టుకుంటే మనవరాలు అపవిత్రమైపోతుందని ఆవిడ అనుమానం.

ఎప్పుడు నిద్ర పట్టిందో రాధకే తెలియలేదు. అర్ధరాత్రి కాబోలు భర్త రాధ జుట్టుపట్టి పైకి లేవనెత్తేటప్పటికి మెలకువ వచ్చింది.

"రాస్కెల్! ఇడియట్! ఇంట్లో నాటకాలు సాగిస్తున్నావా? అంటూ శక్తికొద్ది కొట్టడం మొదలు పెట్టాడు.

దవడలు పగిలి పోయాయి. పళ్ళు రాలిపోయాయి. నోరంతా రక్తకాలువలు. ఒళ్ళంతా రక్తసిక్తం. గొడ్డును బాదినట్టు బాదుతూనె ఉన్నాడు. జాకెట్టు చీర చిరిగి ముక్కముక్కలై పోయాయి.

ఇంకా కోపం ఆపుకోలేక గోడకేసి తల బాదాడు. నేలనేసి తొక్కాడు. అత్తగారు ఒక్కమాట అనలేదు.

కొడుకు రాక్షస ప్రవర్తనకు అడ్డు చెప్పలేదు. తానొక రాక్షసిలా చూస్తూ నిలబడింది.

రాధను బయటకు లాగాడు. అర్ధరాత్రి వీధి తలుపులు తీసి తిరిగి తలుపులు పెట్టుకున్నాడు.

చంటిపిల్ల అమ్మా! అమ్మా! అంటూ గుక్కపట్టి ఏడుస్తోంది. అవేమీ వినే స్థితిలోకాని బాధపడే స్థితిలోకాని లేదు

రాధ. అలా ఎంతసేపు పడుందో తనకే తెలీదు. స్పృహ వచ్చే టప్పటికి కోడికూత దూరంనుంచి వినబడుతోంది. నోరెండి పోతోంది. దాహం, ఒళ్ళంతా చెప్పలేని బాధ.

ఇరుగు పొరుగులు ఎవరో దూరంనుంచే చూసారు కాని ఆమెను ఒక్కరూ వచ్చి ఆదుకోలేదు. అసలు రాత్రి జరిగిన సంఘటన అందరికీ తెలుసు. తలుపు సందులలోనుంచి అందరూ చూస్తూనే ఉన్నారు. తలుపు తీసుకొని ఒక్కరు ముందుకు రాలేదు.

అంతలో ఆపద్బాంధవుల్లా ఒక కుంటి గుడ్డి ముష్టి దంప తులు జోలి, చిప్ప పట్టుకొని పక్కనించే పోతున్నారు. వారికి రాధ మూలుగు వినబడింది. వెంటనే ముందుకు కాలు కదపలేక ఆగిపోయారు. అటు ఇటు జూసి ఆమెను సమీపించారు.

ఆమె దాహమని సంజ్ఞ చేసింది. ఆ దంపతులకు దుఃఖము పెల్లుబికింది. ఆమె దీనస్థితిని అర్థం చేసుకొన్నారు. ఆమెచేత కాసినినీళ్లు తాగించారు.

తర్వాత మెల్లిగా లేవతీసి కూర్చోపెట్టారు.

ఒళ్ళు మెడ తడుముకొంది. మెళ్ళో పుస్తెలులేవు. చెవు లకు దుద్దులు లేవు. చేతికి గాజులుకూడా లేవు. దొంగలేపట్టు కెళ్ళారో, భర్తే ఒలుచుకున్నాడో తెలీదు. నిజంగా ఆమె ఇప్పుడు బిచ్చకత్తెలాగే ఉంది.

నా అన్నవారు లేరు ? ఎక్కడికి వెళ్ళాలి ? ఏమి చెయ్యాలి ? చెప్పలేని బెంగ దిగులు బయలుదేరింది, మరోపక్క కన్నబిడ్డ కోసం గుండెలుపిండే మమకారం. తాను ఒంటరిది.

అనాధ. అబల. అందుకే మెల్లగా వారు నడిపించుకు వెడుతుంటె కదలలేక వారివెంట వెళ్ళిపోయింది. అందాల రాధ, ఆ ఇంటి కోడలు రాధ బిచ్చకత్తెగా మారిపోయింది.

ఎన్నో వూళ్ళు వారితో బిచ్చమెత్తుకొంటూ తిరిగింది. అయినా చావలేదు. ఎన్నో అవమానాలు భరించింది. గుండె రాయి చేసుకొంది. ఊళ్ళన్ని నడిచి నడిచి కాళ్ళు కరుడుకట్టాయి. చివరకు జబ్బు పడింది. ఇంక తాను బ్రతకనని ఆ బిచ్చకత్తెకు తెలిసిపోయింది. అన్ని బంధాలు తెంచుకొంది. కాని కడుపు తీపి ఒక్కటే సన్నగా మూలుగుతోంది. అత్తను తిట్టుకోలేదు. భర్తను నిందించ లేదు. కన్న కూతురుపై తపన ఆరిపోయె దీపంలా కొట్టుకొంటోంది. ఆ చిన్నారిని ఒక్కసారి చూసి ప్రాణాలు వదలాలి. ఆ తపనతోనే ఆ వూరు బయలుదేరి వచ్చింది. తన కోరిక నెరవేరింది.

ఇంకా అలాగె చూస్తూ నుంచున్న ఆ బిచ్చకత్తెను చూసి చుట్టుపక్కల జనం అక్కడకు చేరారు.

"పిల్లల్ని ఎత్తుకుపోయే దొంగ దొంగ" అని అరిచారు.

పొమ్మన మన్నారు. ఆమెకు వినబడలేదు. కదలలేదు. పిచ్చిదని పిల్లలు రాళ్ళు విసరడం మొదలు పెట్టారు. ఆమె నేలకు ఒరిగిపోయింది. పిల్లను జూసిన సంతోషంలోనె ప్రాణాలు పోయాయో, పిల్లలు కొట్టిన రాళ్ళతోనే ప్రాణాలు పోయామో కాని ఆమె ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

అది చూసి భయపడి అంతా ఇళ్ళలోకి పారిపోయారు. అత్తగారు పిల్లని చంకనేసుకుని తలుపు పెట్టుకొంది

అందరూ వెళ్ళిపోయిన తరువాత ఏదో అనుమానం వచ్చిన రాధ భర్త, అత్త తలుపుతీసి తొంగిచూసారు. ఎవరైనా చూస్తారేమోనని భయం, దిగులు.

మునిసిపాలిటి వారు శవాన్ని తీసుకు పోతున్నారు అందరూ పైసలు గిరవాటు పెడుతున్నారు. ఒక పాత బట్ట పది రూపాయలు గిరవాటు పెట్టి అందరికంటె ముందు తలుపులు మూసుకున్నారు ఆ తల్లీ కొడుకులు.

బిచ్చగత్తెను దహనానికి తీసుకుపోయారు.

(విశ్వరచనలో ప్రథమ బహుమతి పొందిన కథ)